# ముసుగులో వైరం

'ప్రొఫెసర్‌గారు మిమ్మల్ని పిలుస్తున్నారండి'

ప్యూన్ పెంచలయ్య మాట వినేసరికి, థీసిస్ కాపీ పరిశీలిస్తున్న విల్సన్ నిర్ఘాంతపోయాడు. ఇంగ్లీషు శాఖలో ఆయన రీడర్‌గా పనిచేస్తున్నాడు. అనవసరంగా ఎన్నడూ పిలవని ప్రొఫెసరు ఎందుకు పిలుస్తున్నట్టు? ఆలోచిస్తూ ఆయన గదికి వెళ్ళాడు.

'రండి రండి విల్సన్‌గారూ...'

ఆయన మాటల్లో పారుష్యం లేకపోవడంతో, విల్సన్ కొండంత ధైర్యం తెచ్చుకున్నాడు. 'ఎందుకో పిలిచారట' కొంచెం బెదురుతూ అన్నాడు.

'మరేంలేదు. మీ శక్తి సామర్థ్యాలు నాకు తెలియనివి కావు. మీరు మంచి టీచర్... ఈ మధ్య మీరు క్లాసులో ఇంగ్లీషు కంటె తెలుగు లోనే ఎక్కువగా చెపుతున్నట్టు నిన్న యిద్దరు స్టూడెంట్స్ కంప్లెయింట్ చేశారు. ఈ కంప్లెయింట్ వి.సిగారి దాకా వెడితే బాగుండదు చూడండి... సంగతేమిటో కనుక్కుందామని పిలిచాను...?'

ప్రొఫెసర్‌గారు పైకి ప్రసన్నంగా కనిపించినా, ఆ ప్రసన్నత చాటున ఏదో కిటుకు దాగి వుంటుందని పదమూడేళ్ళుగా పనిచేస్తున్న విల్సన్ ఊహించలేకపోలేదు.

గంభీరంగా యిలా అన్నాడు. 'ప్రస్తుతం ఇంగ్లీష్ రొమాంటిక్ పొయట్రీ గురించి చెపుతున్నాను. స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచీ మనదేశంలో ఇంగ్లీషు ప్రాధాన్యం తగ్గిపోతున్న విషయం మీరామధ్య మన డిపార్టుమెంట్ మీటింగులో ప్రస్తావించారు చూడండి...'

'అవునవును... మొన్నటికి మొన్న వి.సి.గారు ఒక పబ్లిక్ మీటింగులో తెలుగులోనే ఉపన్యసించారు. అందరూ పైకి మెచ్చుకున్నా, లోలోపల కొంతమంది– మన యూనివర్శిటీ టీచర్సే... మరోలా అనుకున్నట్టు వదంతి...'

'వి.సి.గారు తెలుగులో ఉపన్యసించారని కాదు, స్టూడెంట్స్‌కి బాగా అర్థం కావాలనే దృష్టితో అవసరం వచ్చినప్పుడల్లా నేను తెలుగు ఎక్కువగా వాడుతున్నా. అదీగాక మన భావ కవిత్వం గురించి చెపితే, రొమాంటిక్ పొయెట్రీని మనవాళ్ళు అనాయాసంగా అర్థం చేసుకుంటారని నా అభిప్రాయం. కంపారటివ్ ఔట్‌లుక్ చాలా అవసరం. పైగా మనం చెపుతున్నది వాళ్ళకి సరిగా అర్థం కానప్పుడు మన కృషి నిరర్థకమే గదండీ...'

ఏదో చెప్పాలనుకున్న ప్రొఫెసరుగారికి ఏం చెప్పాలో తోచలేదు. విల్సన్ మహా చతురుడని ఆయనకి తెలుసు. విల్సన్ మాటలు యుక్తియుక్తంగా కనిపించాయి. అనవసరంగా తప్పుపట్టడం వాంఛనీయం కాదనుకున్నాడు. 'మీరన్నది నిజమే. స్టూడెంట్స్‌కి అర్థమయ్యేలా వివరించడమే మన ధ్యేయం' అని మౌనం వహించాడు. తాను చెప్పదలచుకున్నది స్పష్టం చెయ్యలేకపోయాననే కొరత ఆయనలో మిగిలిపోయింది. కొరత అనడం కంటే అసంతృప్తి అనడం సముచితమేమో!

'సార్! పోస్టాఫీస్ వెడుతున్నాను... ఏదో ప్యాక్‌చేసి పంపాలన్నారు. పొద్దున...' ద్వారం వద్దనే నిలబడ్డాడు పెంచలయ్య.

'గుర్తుచేశావ్, లేకపోతే యివ్వాళ్ల కూడా మరచిపోయి వుందును' అంటూ ప్రొఫెసరు గారు ఒక థీసిస్‌కాపీ పెంచలయ్యా చేతికిచ్చాడు. అతను వెళ్ళిపోయాడు.

'అన్నట్టు మీతో చెప్పడం మరచిపోయాను' శ్రీ అరవిందుల రచన సావిత్రి టేబిల్‌మీద వుంటే, అది చూస్తూ వున్న విల్సన్ తల పైకెత్తాడు. చూపులో ఆదుర్దా ఏదో కానవచ్చింది.

'మన అధ్యాపకుల్లో కొందరు అవినీతి కృత్యాలకు పాల్పడుతున్నట్టు వి.సి.గారు ఆవేదన వెలిబుచ్చారు. కొన్ని ఫిర్యాదులు కూడా తమకు

చేరినట్టు తెలిపారు...' ప్రొఫెసరుగారికి తెలియకుండానే విషాదం ఆయన్ని అవహించింది. అయినా మేకపోతు గాంభీర్యం వహించాడు. 'ఎందుకైనా మంచిది, మనం మన జాగ్రత్తలో వుండడం మంచిదనిపిస్తోంది...'

ఉన్నట్టుండి ప్రొఫెసరుగారి ముఖం వివర్ణం కావడం గమనించకపోలేదు విల్సన్. 'ఆయనేదో అన్నారని మనం భయపడడం దేనికండి? మన నీడను చూసి మనమే భయపడితే చివరికది మరోలా వికటించవచ్చు...' ధైర్యం చెప్పాడు.

ప్రొఫెసరుగారు నవ్వడానికి ప్రయత్నిస్తుంటే ద్వారం వద్ద రెండు మూడు ఫైళ్ళతో క్లార్కు ప్రత్యక్షమయ్యాడు. అంకురిస్తున్న చిరునవ్వు అదృశ్యమైంది. వాళ్ళిద్దరూ ఒకరినొకరు సందేహిస్తున్నట్టుగా చూసుకున్నారు.

'మళ్ళీ వస్తాను సార్...' అంటూ విల్సన్ తన గదికి దారితీశాడు. మనస్సులో క్షీరసాగర మథనం ప్రారంభమైంది.

ఒక ఆదివారం సాయంకాలం పెరట్లో వున్న కూరపాదులకు త్రవ్వకం పెట్టి నీళ్ళుపోసి, గేటుపక్కనున్న క్రోటన్లకు నీళ్ళు పోస్తున్నాడువిల్సన్. గేటు చప్పుడయింది. ఎవరా అనుకుని గేటు వద్దకు వెళ్ళాడు. 'రండి రండి శాస్త్రిగారు'... అంటూ ఆహ్వానించాడు. డ్రాయింగు రూముకి తీసుకువెడుతూ, 'ఊరక రారు మహాత్ములు'...అన్నాడు మందహాసం చేస్తూ.

విల్సన్‌గారూ, మీరేమనుకున్నాసరే నా దృష్టిలో మహాత్మ శబ్దం ఒక్క గాంధీగారికే వర్తిస్తుంది...'

'కాళ్ళు, చేతులూ కడుక్కుని యిప్పుడే వస్తాను' అంటూ విల్సన్ లోపలికి వెళ్ళాడు. రెండు నిమిషాలలో ఆయన భార్య కాఫీ కప్పుతో వచ్చింది. 'మీరు సంస్కృత డిపార్టుమెంటులో రీడరుగా వున్నారని మావారు చెప్పారు. తమ దర్శనభాగ్యం కలగడం నా అదృష్టం' అంటూ, అభివాదనం చేసింది.

'నమస్కారమమ్మా...మిమ్మల్ని ఎప్పుడూ చూడలేదు' శాస్త్రి ప్రత్యభివాదనం చేశాడు. చేస్తూ ఆమె మెడలోని పసుపుతాడుని చూశాడు; తాడుకి వేలాడుకున్న శిలువ దృశ్యాదృశ్యంగా కనిపిస్తోంది పమిట చాటున.

అద్దాల అలమరలో అందంగా పేర్చబడిన పుస్తకాలు శాస్త్రి దృష్టిని ఆకర్షించకపోలేదు. ముఖ్యంగా రామాయణ, భారతాలు... పక్కనే నల్లని బైండులో బైబిలు! టేబిలుమీద తాటికాయంత అక్షరాలలో కాళిదాసు పేరు కనిపిస్తున్న ఏదో ఆంగ్లగ్రంథం! విల్సన్‌కి సంస్కృతమంటే అభిమానం కాబోలు. రామాయణం భారతాలంటే ఆదరభావం కాబోలు! శాస్త్రి అయోమయావస్థలో పడ్డాడు. అన్నిటికంటె మిన్నగా ఆయన భార్య మెడలో పసుపుతాడు... గది నాలుగు మూలలూ ఓరచూపులతో పరికిస్తూ కాఫీ తాగుతుంటే విల్సన్ వచ్చాడు, ... కడిగిన ముత్యంలా కనిపిస్తున్నాడు. 'మీ క్కాబోయే విద్యార్థిని యిచ్చిన కాఫీ బాగుందా?... వట్టి కాఫీతోనే సరిపెడతావా ఏమిటి? అన్నాడు.

భర్త అభిప్రాయం గ్రహించి ఆమె లోపలికి వెళ్ళి మూడు నాలుగు నిముషాలలో పళ్ళ ముక్కల ప్లేటుతో తిరిగి వచ్చింది.

'తీసుకోండి, పళ్ళముక్కలే...'

'నామమాత్రానికే నేను శాస్త్రినిలెండి... ఏ శాస్త్రమూ క్షుణ్ణంగా చదవలేదు' రెండు పళ్ళముక్కలు నోట్లో వేసుకున్నాడు.

'అదేం మాటండీ... సంస్కృతం బాగా చదువుకుంటే చాలు. మన భారతీయ సంస్కృతిని సరిగా అర్థంచేసుకోవచ్చు...? ఆమె మాటలు తెచ్చిపెట్టుకున్నవిగా లేవు.

'ఈ రోజుల్లో మీలా అనుకునేవారు ఎంతమంది చెప్పండి?' శాస్త్రి మాటల్లో ఆశ్చర్యం కూడా చోటుకుంది.

'ఈ మాత్రానికే మీరు ఆశ్చర్యపోతున్నట్టున్నారు! మా ముత్తాతలు తిరుచిరాపల్లి వాస్తవ్యులనీ, విద్వాంసులు కాకపోయినా సంస్కృతంలో కొద్దిగానో గొప్పగానో ప్రవేశం వున్నవారనీ నేను చెపితే మీరు నిజంగానే ఆశ్చర్యపోతారేమోనని అన్నాడు విల్సన్, నవ్వుతూ.

'అయితే మీరు తెలుగువారు కాదా?'

'మా తండ్రిగారి తరం నంచీ అన్ని విషయాలలోనూ నేను తెలుగువాళ్ళమే అయినా, మా ముత్తాతలు తమిళులు... బ్రాహ్మణులు...

మతం స్వీకరించారు..కాథలిక్కులుగా మారిపోయారు. అయినా వాళ్ళు పిలకజుట్టుని విడవలేదు. అలాగే పంచె కట్టు కూడా మానలేదు. విన్సెన్ట్ అయ్యర్ లాంటి పేర్లతో వ్యవహృతులైనా, చర్చికి వెళ్ళినా, ఇళ్లల్లో మాత్రం వాళ్ళ ఆచార వ్యవహారాలు పూర్వంలా వుండేవని చెపుతారు. పేరుకి క్రైస్తవులైనా, స్త్రీలు హిందువుల్లా కనిపించేవారనీ చెపుతారు. మంగళసూత్రం, కుంకుమబొట్టు మానలేదు. వివాహ సమయంలో ఉంగరాలు మార్చుకోవడంలాంటి క్రైస్తవాచారాలు చర్చిలో పాటించినా ఇంట్లో విధిగా కంచిపట్టు ఎర్రచీరె(తోపురంగు) కట్టుకోవడం మేలిముసుగు పరిహరించడం హారతి తియ్యడం వంటివి పాటించారు. ఇవి వారి పూర్వాచారాలు. కొందరు స్త్రీలు తొమ్మిది గజాల 'మడిశార్' చీర కట్టుకొనేవారు. మతం పుచ్చుకున్న అలాంటి బ్రాహ్మణ కుటుంబాలు కొన్ని తిరుచిరాపల్లిలో నివసించిన 'అగ్రహారానికి' సెయింట్‌మేరీతోప్ (తోపుతోట)అనే వ్యవహారనామం కాలక్రమేణ ఏర్పడింది. బ్రాహ్మణుల ఆచారాలలో అభిరుచులలో మార్పులు కనిపించే యీ రోజుల్లో కూడా క్రైస్తవుల్లో తమిళ బ్రాహ్మణ కాథలిక్కుల ఆచారాలు పాటించేవారు కొందరున్నట్టు వినికిడి. శాకాహారులైన ఫాదరీలు ఉన్నారు. ఆ బ్రాహ్మణ కాథలిక్కుల సంతతివారు కొందరు విదేశాలలో వున్నారట. వాళ్లలో కొంతమంది వెల్లుల్లి కూడా ముట్టుకోరట...

'శాస్త్రిగారి ముందు ఆ విషయాలన్నీ ఎందుకులెండి...' అంది విల్సన్‌భార్య. భర్త చెపుతున్న ఆ పాత విషయాలకు అడ్డు తగులుతూ.

'తెలియని విషయాలు తెలుసుకోవడంలో తప్పు లేదమ్మా, పదిహేడో శతాబ్దిలో ఇటలీకి చెందిన జెసూయిట్ పాదిరి రాబర్ట్ డినొబిలీ అనే ఆయన మధురలో కొందరు బ్రాహ్మణుల మతాంతరీకరణకు కృషి చేసినట్టు విన్నాను. ఆయన బ్రాహ్మణుల ఆచార వ్యవహారాలు అవలంబించడమే. కాక సంస్కృతం కూడా నేర్చుకున్నాడు...పాండిత్యం గడించాడు.

'అందువల్ల శాస్త్రిగారు నొబిలీని గుర్తుంచుకున్నారనుకుంటాను...,' అన్నాడు విల్సన్.

'అలా అని కాదు...మనదేశానికి వచ్చి మనభాషలు నేర్చుకోవడం గొప్ప కదుటండీ.'

'ఇందాక నేను తమాషా కోసం అన్నాను. ..మరోలా అనుకోకండి...'

'విల్సన్‌గారూ, మీకు తెలుసో తెలీదో మా యింటి పేరు యితర కులాలలోను కనిపిస్తోంది సురల జన్మంబును ఏరుల జన్మంబు నెరుగనగునె అన్నట్టుగా...యిదంతా...

'సార్..సార్'

'పెంచలయ్య గొంతులా వుందే' అంటూ విల్సన్ వీధి గుమ్మంలోకి వచ్చాడు.

ప్రొఫెసరుగారి పరిస్థితి అదోలా వుందని చెప్పుకుంటున్నారు' అన్నాడు పెంచలయ్య ఆందోళన చెందుతూ.

అప్పుడే అక్కడికి వచ్చిన శాస్త్రి 'మీ ప్రొఫెసర్‌గారా' అడిగాడు ఆదుర్దాగా.

'అవును సార్'

'ఆయనా నేనూ ఒక వూరివాళ్లం. చాలా మంచివాడు. నిక్కచ్చి మనిషి చూసివద్దాం పదండి...'

సందేహిస్తూ విల్సన్ అడిగాడు 'మీరేదో పనిమీద వచ్చినట్టున్నారు.'

'ఆ పని రేపు చూసుకోవచ్చులెండి..'

వాళ్లిద్దరూ బయలుదేరారు. అడుగులో అడుగు వేసుకుంటూ వెనకాల పెంచలయ్య.

'మీ ప్రొఫెసరు గారు చాలా గంభీరుడండి... ఆయన స్వభావం నాకు బాగా తెలుసుగదా...' అన్నాడు శాస్త్రి అలముకున్న మౌనాన్ని ఛేదిస్తూ.

'నిజమే అనుకోండి... ఈ మధ్య ఆయన మీద కొన్ని పుకార్లు పుట్టించారు...'

'ఎవరా త్రాష్టులు!' ఆశ్చర్యంగా చూశాడు, తీవ్రంగా స్పందిస్తూ.

'ఇంకెవరుంటారు? మనవాళ్లే...మా డిపార్టుమెంటు క్లర్కుకి పురి ఎక్కించారు. వాళ్లు చెప్పినట్టుగా అతను తల ఆడించాడు.

'ఇంతకూ వాళ్ల ఏడుపుయేమిటి..' అడిగాడు శాస్త్రి విసుగ్గా.

'ఈమధ్య ప్రొఫెసరుగారు నేషనల్ సెమినార్ దిగ్విజయంగా జరిపించారు. అనువాదాల మీద ఒక వర్క్‌షాప్ నిర్వహించారు. డిపార్ట్‌మెంట్ సెమినార్లు సరేసరి. లాభం లేందే సెట్టి వరదపోతాడా– అని వాళ్ల విమర్శ.

'ఇంకా?' శాస్త్రి ప్రశ్నలో హేళన స్పష్టం.

ఆ మధ్య ప్రొఫెసరుగారు వాళ్లమ్మాయి పెళ్లి చాలా గొప్పగా చేశారు గదా! కట్నం కానుకలు, విందులు వేడుకలు వాటికన్నిటికీ అంతడబ్బు ఎలా వచ్చింది? అక్రమ సంపాదనే కారణమని వాళ్ల అభిప్రాయం..'

'చెప్పడం మరిచిపోయారేమో...ప్రొఫెసరుగారి పెద్దబ్బాయి బి.ఇ.పూర్తి చేశాడు. రెండో అబ్బాయి మొన్ననే మెడిసిన్ చేరాడు. ఇప్పుడాయన నెహ్రూనగర్‌లో బ్రహ్మాండమైన యిల్లు కడుతున్నాడు... ఈ డబ్బంతా ఎక్కణ్ణుంచి వచ్చింది?

'మీరిప్పుడు చెప్పిన సంగతులన్నీ వాళ్ల ఫిర్యాదుల్లో వున్నవే..!'

'విల్సన్‌గారూ తెలీక అడుగుతున్నాను..

మనవాళ్లు పాఠాలు చెప్పే అధ్యాపకులా లేకపోతే లెక్కల ఆరాలు తీసే ఇన్‌కంటాక్స్ ఉద్యోగులా?

వాళ్ల మాటలు వింటున్న పెంచలయ్య కొంచెం ముందుకి వచ్చి, 'ఇన్‌కంటాక్స్ వాళ్లు రెండు మూడు రోజుల్లో రెయిడ్ చెయ్యాలని అనుకుంటున్నట్టు ఎవరో ఓల్డ్ స్టూడెంటు ద్వారా ప్రొఫెసరుగారు తెలుసుకున్నారట...' అన్నాడు.

'నేననుకున్నంతా జరిగినట్టుంది' విల్సన్ తన విచారం వ్యక్తం చేశాడు.

'అయితే మీకు ముందే తెలుసా యేమిటీ' 'తెలుసని కాదు, ఊహించాను మా క్లార్క్ మాటలు బట్టి..'

'ప్రొఫెసరుగారిలా జరుగుతుందని అనుకున్నారా?' ప్రశ్నించాడు శాస్త్రి.

ఆ విషయం నాకు తెలియదు కానీండి... ప్రొఫెసరుగారు మాత్రం సుమారు ఒక నెలరోజులుగా దిగులుగా వున్నట్టు కనిపించేవారు...ఎందుకో భయపడుతున్నట్టుగా నాకు కనిపించింది.

'విల్సన్‌గారూ, యిప్పుడు చెపుతున్నాను శ్రద్ధగా వినండి...మనవాళ్లు ఆయన్ని వృధాగా శంకించారు. అభాండాలు వేశారు. రాత్రికి రాత్రే ఆస్తిపాస్తులు ఆర్జించినవాడుకాదు ఆయన. బాగా వున్న కుటుంబం వాళ్లది. మా వూళ్లో రాజభవనం లాంటి రెండంతస్తుల భవనం వుంది. పొలం పుట్ర వున్నవాడు. తన తదనంతరం వాటిని అజమాయిషీ చేసేవాళ్లు వుండరని, రెండుమూడు నెలల క్రితం ప్రొఫెసరుగారు తరతరాలుగా వస్తున్న ఆస్తిని విక్రయించి పట్టణంలో స్థిరపడదామని నిశ్చయించుకున్నట్టు విన్నాను..'

'అందుకే కాబోలు ప్రొఫెసరుగారు ఆ మధ్య నెలరోజులు సెలవు పెట్టి తమ గ్రామం వెళ్లారు?

'విమర్శించే ముందు ఎవరైనా సరే పూర్వాపరాలు తెలుసుకోవడం చాలా అవసరం. అనవసరంగా వదంతులు కల్పించడం నీలాపనిందలు వేయడం అనుచితం. మనవాళ్లకిది అసభ్యంగా తోచక పోవడం చాలా ఆశ్చర్యంగా వుంది..' ఉద్రేకంగా అన్నాడు శాస్త్రి.

'మీ రన్నది కరెక్ట్ శాస్త్రిగారు...'

రోడ్డు మలుపు తిరిగారు. ప్రొఫెసరుగారి యిల్లు కనిపిస్తోంది. బారు తీరిన కార్లు, స్కూటర్లు, సైకిళ్లు...మూగిన జనం. వి.సి.గారి కారు...

'జరగకూడంది జరగలేదుగదా...' శాస్త్రి మాటల్లో భయాందోళనలు పెనవేసున్నాయి.

'ప్రొఫెసరుగారు రాత్రి కూడా బాగానే వున్నారట... గుండెపోటు వచ్చిందట...చెప్పుకుంటున్నారు గుమిగూడిన ప్రజలు. 'అనాయాస మరణం నీది. అశ్రువులు మావి' శాస్త్రి మనస్సు–మననం చేసుకోసాగింది.